కాంతి కిరణాలు

పందిరిమంచంమీద, తెల్లటి దుప్పటి దానిమీద మల్లెపువ్వులు ఘుమఘుమ లాడుతున్నాయి. పందిరి చుట్టూరా, మల్లెపూవుల దండలు వ్రేలాడుతున్నాయి. మల్లెపువ్వులన్నీ ఒక్కసారిగా తమలోని సువాసనలను వెదజల్లుతున్నాయి. మంచం ప్రక్కనే టేబుల్ మీద రకరకాల తీపిబండారాలు, వాటిమధ్య అగరవత్తుల స్టాండు, అగరవత్తులు వెదజల్లే కమ్మటి సువాసనలకు, మల్లెపువ్వుల పరిమళాలు తోడై, గిరిధర్‌ను మత్తెక్కిస్తున్నాయి.

మధురమైన అనుభూతులతో, తియ్యని కోరికలతో, అతడి మేను పులకించిపోసాగింది. ఝాన్సీతో, అందుకోబోయే స్వర్గం గురించి ఆలోచిస్తూ, ఆమెకోసం ఎదురుచూడ సాగాడు.

క్షణం ఒక యుగంగా ఎదురు చూస్తుంటే, ఝాన్సీ గదిలోకి అడుగు పెట్టింది. పాలనురుగులాంటి చీరతో ఆమె పుత్తడిబొమ్మలా ఉంది. సిగ్గుతో తలవంచుకొని తలుపుదగ్గర నిలబడింది.

కోటి కోరికలతో తనకోసం ఎదురు చూస్తూ, మనసు, తనువు, చివరికి తన జీవితమే అర్పించటానికి సిద్ధంగా ఉన్న ఆ స్త్రీమూర్తిని, తన హృదయానికి హత్తుకోవాలని, ఆమెను చేరబోతుంటే, తన్మయత్వంతో నెమ్మదిగా ఝాన్సీ దగ్గరకు వచ్చాడు గిరిధర్.

"ఝాన్సీ!" మధురంగా పిలుస్తూ, రెండూ చేతులు జాసి, తన బాహువుల్లో బంధించేందుకు, చిరునవ్వుతో భార్యను ఆహ్వానించాడు

ఝాన్సీ నెమ్మదిగా, తల పైకి ఎత్తి భర్తవంక చూసింది. ఆరాధనతో నిండిన అతడి చూపులకు, ఒక్క ఉదుటున వచ్చి, అతడి బాహువుల్లో వాలిపోయింది. ఆమె నడుము చుట్టూ చేతులు బిగించి, గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు గిరిధర్. తొలి స్పర్శకు ఇద్దరి మేనులు పులకించిపోయాయి. ఆ మధురానుభూతిని, ఆస్వాదిస్తూ ఒక నిముషంసేపు మైమరచిపోయారు.

ఝాన్సీ నెమ్మదిగా కిందకు జారి, భర్త పాదాలపై వాలిపోయింది.

ఝాన్సీ తలఎత్తి భర్తవంక చూసింది. ఆమె కళ్ళు తడితో మెరుస్తున్నాయి

"మీరు నిజంగా దేవతలు. మీ ఇల్లాలుగా నన్ను చేసుకొని, నా జీవితానికి ఒక అర్థాన్ని కల్పించిన దైవ

కందేపు సుజాత

స్వరూపులు." ఆనందాన్ని తట్టుకోలేక తడబడుతూ, అంటున్న భార్యవంక వింతగా చూశాడు గిరిధర్.

భార్య కళ్ళల్లో ప్రతిఫలిస్తూన్న, అనురాగాన్ని తిలకిస్తూ, ఆమెను లేవనెత్తి హృదయానికి అదుముకున్నాడు.

"ఏమండీ!" ఆరాధనగా అంటూ, వెక్కి వెక్కి ఏడ్చింది ఝాన్సి.

భార్య భుజం తడుతూ, "పిచ్చిదానా! ఏమిటీ పిచ్చి. ఇలాంటి సమయాల్లో ఏడవకూడదు." అనునయిస్తూ మంచం దగ్గరకు నడిపించి, మంచంమీద కూర్చోబెట్టి, పక్కనే తాను కూర్చున్నాడు గిరిధర్.

ఝాన్సీకి ఉపశాంతి కలిగింది కాసేపటికి.

"ఝాన్సీ" అంటూ, ఆమె చేతిపైద చెయ్యివేసి మృదువుగా నొక్కాడు గిరిధర్. ఇద్దరి హృదయాలు తన్మయత్వంతో తేలిపోయాయి. గిరిధర్ భార్యకు దగ్గరగా జరిగి, ఆమె భుజం మీద తల ఆనించి, ప్రక్కనుండి కనిపిస్తున్న ఆమె నునుపాటి బుగ్గలను చూస్తూ, "ఈ రాత్రి మనకు ఎంతో మధురమైనది. ఈ రోజు నుండి మన ఇద్దరి జీవితాలు, ఒకటిగా కలిసిపోతాయి ఈ రేయిలోని మాధుర్యాన్ని చవిచూడకపోతే, ఆ లోటు జీవితంలో ఎప్పటికీ తీరదు. అంత అందమైన రాత్రి ఇది." నెమ్మదిగా గుసగుసలాడుతున్నట్లు చెప్పుతున్న, భర్త మాటలకు సిగ్గుపడిపోయింది ఝాన్సీ. ఆమె బుగ్గలు కెంపులుగా మారాయి.

సిగ్గుతో ముడుచుకుపోతున్న భార్యను చూస్తుంటే, గిరిధర్‌కు ఆవేశం ముంచుకు వచ్చింది. ఆమె గడ్డాన్ని పట్టుకొని పైకెత్తి చప్పున ఆమె పెదవులతో, తన పెదవుల్ని కలిపాడు గిరిధర్.

క్షణం సేపు కాలం స్తంభించి పోయింది ఇద్దరి మధ్య. భర్తచేసిన పనికి అతడివంక చూడలేకపోయింది ఝాన్సీ. తొలిసారి ముద్దు ఝాన్సీకి చాలా మధురంగా వుంది...ఆ తియ్యని అనుభూతినుండి బయటపడి, భార్యవంక తదేకంగా చూడసాగాడు.

"ఈరోజు అనుభవించే అనుభవం కోసం ఎంతగా ఆరాటపడుతున్నానో తెలుసా!" అని, "మరి...నీకు అలాంటి అనుభవంకోసం ఆరాటం లేదా ఝాన్సీ?" భార్య చేతిని, తన చేతిలోకి తీసుకొని మృదువుగా నిమురుతూ, అడిగాడు గిరిధర్.

భర్త మాటలకు ఝాన్సీ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. బలబల చెంపల మీదుగా జారి, గిరిధర్ చేతిమీదపడ్డాయి.

తృళ్ళిపడ్డాడు గిరిధర్. "ఏమిటిది ఝాన్సీ?" ఖంగారుగా అడిగాడు...

"ప్రతి ఆడపిల్ల యవ్వనంలో ఎన్నో కలలు కంటుంది. తన భర్త గురించి, అతడితో పంచుకొనే జీవితాన్ని గురించి ఎన్నో ఊహలు, అల్లుకుంటుంది. తాను కన్న కలలు నిజంకావని తెలిసినప్పుడు ఎంతగా విలపిస్తుందో, అనుభవించే వారికే తెలుస్తుందండీ!" అంది ఝాన్సి.

"నా కేమీ అర్థంకావటంలేదు." అనుమానంగా, నెమ్మదిగా అడిగాడు గిరిధర్.

ఆహ్లాదకరమైన సమయం తారుమారైంది. అతడి వదనం చిన్నబోయింది. దుఃఖంలో వున్న ఝాన్సి అది గమనించలేదు. ఆమె దుఃఖించే విధానం చూస్తుంటే ఎన్నాళ్ళబట్టో ఆనకట్టవేసిన దుఃఖం, ఇప్పుడు కట్టలు తెంచుకుని వచ్చినంత ఉధృతంగా ఉందనిపించిం దతిడికి.

భార్య భుజంమీద చెయ్యివేసి, "ఏడవకు ఝాన్సీ! నీకు కలిగిన బాధ ఏమిటో నాకు చెప్పు! ఇప్పుడు మన మిద్దరం భార్యా భర్తలం. ఇన్నాళ్ళు ఒకరికి చెప్పుకోలేని బాధలు మనం చెప్పుకొని, ఉపశాంతి పొందవచ్చు" అంటూ అనునయించాడు. చిన్నపిల్లల్ని బుజ్జగిస్తున్నట్టుగా ఓదార్చుతున్న భర్త గుండెల్లో తలదాచుకొంది ఝాన్సి.

కొంతసేపటికి సర్దుకొని కూర్చుని, భర్తవంక చూసింది. అతడి ముఖంలో విచారం, కళ్ళల్లో లక్ష అనుమానాలు, కోటి ప్రశ్నలు కనిపించాయి.

ఝాన్సి నెమ్మదిగా మొదలుపెట్టింది.

ఇన్నాళ్ళూ, నాలో నేనే కుమిలిపోతున్న బాధను ఎవరికీ చెప్పుకోలేకపోయాను. తల్లిదండ్రులకు కూడా చెప్పుకోలేని బాధ అది.

"అదే నా పెళ్ళి సమస్య. నా కీ జన్మలో పెళ్ళి జరుగుతుందని కలలో కూడా ఊహించుకోలేకపోయాను. ఇల్లాలి స్థానం పొందలేననుకున్నాను.

మా నాన్నగారు ఎలిమెంటరీ స్కూల్ టీచర్. ఆయనకు వచ్చే జీతం బొటా

పూటీగా తిండికిసరిపొయ్యేది. ఇక దాచుకునే ఆలోచనే రాలేదాయనకు. నాన్నగారు ముగ్గురు పిల్లలతో సరిపెట్టుకున్నారు. గంపెడు పిల్లలు ఉండి ఉంటే, మరింత హీనస్థితికి దిగజారి ఉండేవారం.

ఇంటికి నేనే పెద్దదాన్ని. వయస్సు రాగానే, పెళ్ళి సంబంధాలు చూడసాగారు నాన్నగారు. నేను, నచ్చితే నాన్నగారు ఇచ్చే బహుతక్కువ కట్నం నచ్చలేదు చాలామందికి

నాన్నగారు నిరాశ చెందక పట్టుదలతో అల్లుడిని కొని, కూతురికి కట్టబెట్టాలని ఎంతగానో తాపత్రయపడ్డారు. ఒక్కటి కూడా కలిసిరాలేదు

ఇలా అయిదేళ్ళు గడిచినా నాకు సంబంధం కుదరలేదు. సంవత్సరాలు గడిచేకొద్దీ నాకు పెళ్ళి జరుగుతుందనే నమ్మకం పోయింది. ఇన్నాళ్ళుగా పెంచుకున్న ఆశలన్నీ పేకమేడలుగా ఒక్కొక్కటిగా కూలిపోయాయి.

ఉద్యోగం చేస్తానంటే అందుకు నాన్నగారు ఒప్పుకోలేదు. ఉద్యోగం చేస్తే తన శవాన్ని పూడ్చిన తరువాత ఉద్యోగంలో చేరమన్నాడు.

నాన్నగారి పట్టుదలకు అదిరిపోయి ఆయన బెదిరింపుకు మౌనం వహించాను. రాను రాను నాలో అశాంతి చోటు చేసుకుంది. నా ఒక్కదానికే పెళ్ళి చేయలేక అవస్థలుపడుతున్న నాన్న గారిని చూస్తుంటే నా గుండె తరుక్కుపోయింది. చెల్లెలి పెళ్ళి, తమ్ముడి చదువు, ఎలా సంసారాన్ని నెట్టుకొస్తారో అర్థంకాలేదు.

నాన్నగారి వరుల వేటకు అంతం అనేది ఉన్నదా ? అనిపించేది. నాన్నగారు ఒక సంబంధం చూశారు.

నేను బ్రతికిఉన్నంతవరకు నాన్నగారి వేటకు, అంతువుండదు. అసలు దీనికంతటికి కారణమైన నేనే అంతం అయిపోతే, నాన్నగారి వేటకు, నాకు, ఒక పరిష్కారం దొరుకుతుందని ఆశించాను.

ఇప్పుడు తెచ్చిన సంబంధం కూడా తప్పిపోతే, ఆత్మహత్య చేసుకుందామనే నిర్ణయానికి వచ్చాను.

మీరు నన్ను చూడటం, వెంటనే మీ అంగీకారం తెలియబరచటం, అప్పటికప్పుడు ముహూర్తం నిర్ణయించటం అన్నీ వరుసగా జరిగాయి.

మీరు కట్నం తీసుకోకుండా నన్ను చేసుకుంటున్నారని, విని ఆశ్చర్యపోయాను. కల కాదుకదా అనిపించింది. అడుగంటిపోయిన నా ఆశలు మళ్ళీ మొలకెత్తటం ప్రారంభించాయి. ఇంట్లో అందరూ పండగ చేసుకున్నారు. అమ్మ నాన్నల సంబరానికి హద్దు లేకపోయింది.

ఒక కన్యను ఆత్మహత్య నుండి తప్పించారు. మీరు మీ యిల్లాలుగా చేసుకున్నారు..." ఇంకా ఏదో చెప్పబోతున్న భార్యను వారించాడు గిరిధర్.

"అవు ఝాన్సీ!" వారింపుగా అన్నాడు.

తల త్రిప్పి, భర్తవంక చూసింది ఝాన్సీ. అతడి వదనం కళా విహీనమై వాడిపోయి ఉంది. అతడి కళ్ళల్లో బాధ స్పష్టంగా కదలాడింది.

"నిన్ను ఆత్మహత్య నుండి నేను కాపాడాను. కాని, మా అక్కయ్యను ఎవరూ రక్షించలేకపోయారు." అతడి కంఠం జీరపోయింది.

ఝాన్సి ఆశ్చర్యంగా చూస్తూ "ఏమిటండీ మీరు చెప్పేది?" అర్థం కానట్టుగా, అయోమయంగా అడిగింది.

"మీ కుటుంబగాథ, మా కుటుంబ చరిత్ర అంతా ఒకటే ఝాన్సీ! మా నాన్నగారికి ఎనిమిది ఎకరాల పొలం, ఒక ఇల్లు వుండేవి. ఆస్తి ఉందనే అహంకారంతో, ఏ ఉద్యోగమూ చెయ్యకుండా, డబ్బును ఇష్టంవచ్చినట్లుగా ఖర్చు చేశారు. మేము పెద్దవాళ్ళం అయ్యేసరికి, ఆస్తి అంతా హరించుకుపోయింది. పూట గడిచేందుకే కష్టం అయిపోయింది.

అప్పుడుగాని నాన్నగారికి, కనువిప్పు కలగలేదు. అప్పటికి ఎదిగిన కూతురు వుందని, గుర్తుకువచ్చింది. ఎన్నో సంబంధాలు చూశారు. ఒక్కటి కూడా కుదరలేదు. అలా పెళ్ళి కాకుండా అక్కయ్య పాతికసంవత్సరాల వయస్సు వచ్చేవరకు కన్యగానే ఉండిపోయింది. ఇక ఈ జన్మలో తనకు పెళ్ళి జరగదనే దిగులుతో బావిలో దూకి, ఆత్మహత్య చేసుకుంది.

ఆస్తిపోయిన దిగులుతో ఉన్న నాన్నగారు కూతురి పెళ్ళిచేసే స్తోమత లేక, కూతుర్ని దూరంచేసుకొని, కుమిలిపోయి, మంచం పట్టి, పెళ్ళి కాకుండా, కన్యగా చనిపోయిన కూతుర్ని వెదుక్కుంటూ తానూ వెళ్ళిపోయారు.

నేను అప్పటికి బి.కాం. పాసయ్యాను. సరిగ్గా ఆ సమయంలోనే, చిన్నప్పుడే భర్తపోయిన మేనత్త ఒకామె ఉన్నది. ఆమెకు పిల్లలు లేరు. జబ్బు చేసి, ఆమె పోయింది. పోతూ పోతూ రెండు ఎకరాల పొలం, ఒక ఇల్లు, కొన్ని నగలు, నా పేర రాసి, పొలం అమ్మి చెల్లెలి పెళ్ళిచెయ్యమనే తన కోరిక వెల్లడించి, చనిపోయింది.

వెంటనే ఒక ఎకరం పొలం అమ్మి చెల్లెలి పెళ్ళి చేశాను. ఉన్నదాంట్లో ఘనంగా చేసి, దాన్ని అత్తగారింటికి పంపించాను.

నాకు ఉద్యోగం వచ్చింది. మళ్ళీ మా యింటి పరిస్థితులు బాగుపడ్డాయి. మేనత్త ఇచ్చిన ఆస్తి మా జీవితాలు, అధోగతి పట్టకుండా కాపాడింది.

అక్కయ్య మరణం నాకు చాల మనస్తాపం కలిగించింది. అక్కయ్య లాంటి అభాగ్యులు దేశంలో చాలామంది ఉన్నారు. కనీసం అలాంటి స్థితిలో ఉన్న ఒక పేదపిల్లను పెళ్ళిచేసుకొని అక్కయ్య ఆత్మకు శాంతి కలిగించాలనే నిర్ణయానికి వచ్చాను.

నా అభిప్రాయం అమ్మకు చెప్పాను. అనభవాన్ని పొందిన అమ్మ వెంటనే ఒప్పుకుంది. అప్పటినుండి వాకబు చెయ్యసాగింది. సరిగ్గా అక్కయ్య ఉన్న స్థితిలో నువ్వు వున్నట్లు తెలిసింది. వెంటనే మనస్ఫూర్తిగా నిన్ను పెళ్ళి చేసుకున్నాను," అన్నాడు గిరిధర్.

ఝాన్సీ మనస్సు వికలం అయింది. బాధగా నిట్టూర్పు విడిచి, మంచంమీద నుండి లేచి, కిటికీ దగ్గరకు వెళ్ళి, నిలబడి, బయిటిక చూడసాగింది.

ఆకాశంలో చంద్రుడు చల్లని వెన్నెల కురిపిస్తున్నాడు నక్షత్రాలన్నీ మిణుకు మిణుకు మంటున్నాయి కొన్ని ఎక్కువ కాంతితో ప్రకాశిస్తున్నాయి. కొన్ని తక్కువ కాంతితో ప్రకాశిస్తున్నాయి

దేశంలో ఉన్న కన్నెపిల్లల పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయి. ఈ డబ్బుగలవాళ్ళు, తమ పిల్లలకు ఎక్కువ కట్నంఇచ్చి, మంచిభర్తతో ముడిపెట్టి, వాళ్ళకు ఎక్కువ ప్రకాశాన్ని కలిగిస్తారు.

కాని, పేదింటి, కన్నెపిల్లలు, అభాగ్యులు, తగినంత కట్నం ఇచ్చుకోలేక నానా యాతనలు పడుతున్నారు. ఆ కన్నెపిల్లలు, తక్కువకాంతితో ప్రకాశిస్తున్నారు. దేవుడి సృష్టిలో, ప్రతివిషయం లోను తేడాతే.

ఆలోచిస్తున్న, ఝాన్సీ మనసు, భారిమైంది. అలా ఎంతసేపు నిలబడి ఉన్నదో, ఆమెకే తెలియదు. చప్పున, భర్త గుర్తుకు వచ్చాడు. తిరిగి చూసింది. అతడు అటు తిరిగి పడుకొని ఉన్నాడు

మొదటిరాత్రి మధురంగా ఉండవలసిన వాతావరణం, మోయలేనంత విషాదంగా మారింది ఝాన్సీకి, చాలా బాధ కలిగింది.

ప్రేమగా మాట్లాడిన భర్త మాటలకు తట్టుకోలేక, తన బాధనంతా బయటపెట్టి ఇద్దరిలోనూ విషాదం నింపింది నెమ్మదిగా నడుచుకుంటూ, వెళ్ళి... మంచమీద, భర్త ప్రక్కన కూర్చుంది.

"ఏవండీ!" అతని, భుజంతట్టి, "నిద్రపోతున్నారా" అంది, నెమ్మదిగా.

"లెదు" కదలకుండానే, అలాగే పడుకొని,సమాధానం ఇచ్చాడు గిరధర్.

భర్త హృదయంలో, విషాదం నింపిన తానే, అతడిని ఆహ్లాదపరచాలనుకొని, ప్రక్కనే బల్లపైన ఉన్న, పాలగ్లాసును అందుకొని, "కొంచెంపాలుతీసుకోండి!" అంది.

"ఇప్పుడు నాకు ఏమీవద్దు ఝాన్సీ! నువ్వు పడుకో," అన్నాడు

గిరిధర్ మాటలకు, ఝాన్సీ మనస్సు చివుక్కుమంది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి తననుతాను సంభాళించుకొని, "ఇందాక నాతో ఏమన్నారో గుర్తులేదా? అప్పుడే మరచిపోయారా?" ఆమె కింతం బరువుగా పలికింది

చప్పున, గిరిధర్ ఇటు తిరిగి, "ఏమన్నాను." భార్య కళ్ళల్లోకి చూస్తూ, కుతూహలంగా అడిగాడు.

భర్తలో కుతూహలం కలిగినందుకు ఝాన్సీ సంతోషించింది... కళ్ళల్లోకి చూస్తున్న, అతడి ... చూపులకు సిగ్గు పడింది.

"చెప్పుఝాన్సీ! ఏమన్నాను. నాకు గుర్తు లేదు." చెప్పమని బలవంతం చేశాడు

నిరుత్సాహంగా ఉన్న భర్త, ఇప్పుడు ఉత్సాహాన్ని పుంజుకొనేసరికి, ఒకప్రక్క ఆనందం, భర్త అన్న మాటలు, తిరిగి అతడికే చెప్పాలంటే, ఏదో తెలియని, సిగ్గు ఆవరించాయి, ఝాన్సీకి.

"ఈ రాత్రి గడిచిపోతే, మళ్ళీ తిరిగి రాదని, అనుభవించవలసిన, అనుభూతులు అన్నీ వదలకుండా, తనివితీరా జీవితంలో, ఎప్పటికీ... మరచిపోకుండా... అనుభవించాలని, అనలేదా?" సిగ్గుపడుతూనే, చెప్పింది.

ఝాన్సీ, మాటలు గిరిధర్‌కు, ఎంతో ముద్దుగా, వినసొంపుగా ఉన్నాయి. మాటలు, నేర్చుకుంటున్న పాపాయి మాటలుగా ఉన్నాయి. తనివి తీరా ఆనందంగా భార్యను చూశాడు.

భార్య భుజం చుట్టూరా చేతులువేసి దగ్గరకి జరిగి, "మొత్తానికి గడుసుదానివే," అంటూ, భార్య చేతిలో ఉన్న పాలగ్లాసు అందుకున్నాడు.

"చప్పగా, చల్లారిపోయ్యాయి. ఎలా గోయి తాగేది." మారాంచేస్తూ, అన్నాడు.

"ఈ రోజుకు ఎలాగో త్రాగండి! రేపటినుండి, వేడిగా ఉన్నప్పుడే తాగుదురుగాని," సముదాయిస్తున్నదానిలా, అంది ఝాన్సీ.

సగంత్రాగి, మిగతా సగం భార్యకి ఇచ్చాడు గిరిధర్.

"ఝాన్సీ!" మృదువుగా, పిలిచాడు.

"ఊఁ మత్తుగా పలికింది, ఝాన్సీ.

"ఈ పాలులాగా, మన జీవితం, చప్పగా ఉండకూడదు. ఎప్పుడూ పచ్చగా ఉండాలి. అలా ఉండాలంటే నీ సహకారం కూడా ఉండాలి." భార్య నడుము చుట్టూ చేతులువేసి, దగ్గరకి లాక్కుంటూ, మృదుమధురంగా, అన్నాడు.

"మీ ఇల్లాలిగా, స్థానం కల్పించిన, మీరు, మీరేది కోరినా కాదనే శక్తి నాకు లేదండీ! ఇప్పుడు నా తనువు, మనసు, అన్నీ మీకే అంకితం చేస్తున్నాను. మన జీవితం, నందనవనం కావాలి. నా జీవితం మీద కాంతికిరణాలు ప్రసరింప చేసిన దైవం మీరు. ఆ చల్లని, కాంతి కిరణాలలోనే నా జీవితాన్ని దాచిస్తాను." అంటూ, భర్త హృదయంలో తల దాచుకుంది.

ఇద్దరూ ఆనందపు అంచులకు చేరుకున్నారు.